వలంటీర్లూ... మీ సేవలకు సలామ్

- ఏటా సేవా పురస్కారాలతో సత్కరిస్తున్న ప్రభుత్వం
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర కేటగిరీల్లో అవార్డులు


అమలాపురంలో వలంటీర్లను నగదు పురస్కారాలతో సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్


మంచంపై ఉన్న రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అమలాపురం టౌన్‌: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతినెలా గౌరవ వేతనం ఇస్తూ ప్రజలకు సేవలు చేసేందుకు 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించారు. సంక్షేమ పథకాలను ఇచ్చేది ప్రభుత్వమే అయినా ఆ సంక్షేమ ఫలాలను ప్రజల ఇళ్లకు తీసుకెళుతున్నది వలంటీర్లు. అందుకే వారి సేవలకు ప్రజలు సలామ్ చేస్తున్నారు. ప్రధానంగా కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆత్మీయులే ఆమడదూరం జరిగినప్పుడు వలంటీర్లు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు తోడై వలంటీర్లు అందిస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారిని సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరిస్తుంది.

అమలాపురం నియోజకవర్గంలో గత వారం రోజులుగా వలంటీర్లకు వందనం కార్యక్రమాలు ఓ పండగలా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు వారి సేవలు పొందుతున్న ప్రజలు సైతం స్వచ్ఛందంగా పాల్గొనడం విశేషంగా చెప్పొచ్చు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో వలంటీర్లకు పురస్కారాలు, సత్కారాల కార్యక్రమం పూర్తయింది. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సత్కారాల సభల్లో భాగస్వాములై వలంటీర్ల సేవలకు జేజేలు పలికారు. సేవా వజ్ర పురస్కారానికి రూ.45 వేలు, సేవా రత్న పురస్కారానికి రూ.30 వేలు, సేవా మిత్ర పురస్కారానికి రూ.15 వేలు చొప్పున నగదు అందించి వలంటీర్లను సగౌరవంగా సత్కరించారు. నియోజకర్గంలో ఉన్న 84 సచివాలయాల పరిధిలో ఉన్న 1,465 మంది వలంటీర్లకు మూడు కేటగిరీల పురస్కారాల నిమిత్తం ప్రభుత్వం రూ.2.22 కోట్లు నగదు అందించింది.

అమలాపురం నియోజకవర్గంలో వలంటీర్లకు పురస్కారాలు

మండలం	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర	మొత్తం	నగదు (రూ.లక్షల్లో)
అమలాపురం పట్టణం	1	5	275	281	43.20
అమలాపురం రూరల్	2	3	467	472	72.45
ఉప్పలగుప్తం	1	5	324	330	48.60
అల్లవరం	1	5	376	382	58.35

సేవ చేసే అవకాశం జగనన్నే ఇచ్చారు



ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా సేవ చేసే అవకాశం మాకు జగనన్నే ఇచ్చారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే గౌరవ వేతనాలతో సగౌరవంగా సమాజంలో పని చేస్తున్నాం. వలంటీర్ అనేది చిన్న ఉద్యోగం కావచ్చు. మేము ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నప్పుడు ప్రజలు చూపించే అభిమానమే మాకు కొండంత భరోసా ఇస్తోంది.

– కట్టా వెంకట నాగరాజు, వలంటీర్, సూర్యనగర్, అమలాపురం

మా సేవలకు గుర్తింపుగా పురస్కారాలు



రాష్ట్ర ప్రభుత్వం మా సేవలకు గుర్తింపుగా నగదు పురస్కారాలు అందిస్తుంది. మాకు పురస్కారాలు అందిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు మా సేవలను కీర్తిస్తున్నప్పుడు చాలా సంతోషంగా అనిపిస్తోంది. జగనన్న మమ్మల్ని ఉపాధి పరంగా ఇంకా ఉన్నతంగా చూస్తాడనే నమ్మకంతోనే వలంటీర్లుగా అంకితభావంతో పనిచేస్తున్నాం.

– ఆకుల పార్వతి, వలంటీర్, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం


విలసవిల్లిలో నక్షత్ర పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో పదహారవ రోజు చండీ హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఋత్విక బృందం పుబ్బ నక్షత్ర జాతకులచే మోదుగ చెట్టుకు పూజలు చేయించారు. దీంట్లో భాగంగా గోపూజ, ఆదిత్య పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న నకులరాజు

అల్లవరం: మండలంలోని గోడి బాలుర, బాలికల గురుకులంలో ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న 190 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గురుకులాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సంఘ మండల శాఖ అధ్యక్షుడు ఉప్పే నరసింహరావు, మోసుగంటి వెంకటేశ్వరరావు, గోసంగి బంగార్రాజు, సాధనాల సత్యనారాయణ, బత్తుల రమేష్‌బాబు, గెద్దం ప్రదీప్, జనుపెళ్ల లోవరాజు, మెండు రాజేష్ బాబు, కొనుకు రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల గృహాలకు రూ.50 వేల విరాళం


ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవికి రూ.50 వేల చెక్‌ను అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్‌: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల వసతి గృహాలకు పట్టణానికి చెందిన పాబోలు వెంకట నరసింహారావు(రాజా), సుభద్రాదేవి దంపతులు రూ.50 వేలు విరాళంగా సమకూర్చారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి ఆలయంలో దాతలు రూ.50 వేల చెక్‌ను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యెండూరి రాఘవ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, అర్చకులు పాల్గొన్నారు.

మార్చురీకి మృతదేహం


సత్యనారాయణ మృతదేహం

అమలాపురం టౌన్‌: స్థానిక శ్రీలలితా థియేటర్ ఎదురుగా ఉన్న సందులో 58 ఏళ్ల వ్యక్తి నిద్రలోనే మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ముమ్మిడివరం మండలం అయినాపురానికి చెందిన దోనిపాటి సత్యనారాయణగా పోలీసులు గుర్తించారు. సత్యనారాయణ బంధువులకు పోలీసులు ఫోన్‌లో సమాచారం అందించారు. అయినా బంధులెవరూ రాకపోవడంతో సత్యనారాయణ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పట్టణ సీఐ క్రిస్టోఫర్ తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్ష


బీవీసీలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

అల్లవరం: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ వల్లూరి ధనరాజు తెలిపారు. ఓడలరేవు బీవీసీ పరీక్షా కేంద్రంలో 710 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 647 మంది హాజరయ్యారని, మరో 63 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రం లైజన్ ఆఫీసర్‌గా విస్తరణాధికారి లక్ష్మణరావు, రూట్ ఆఫీసర్‌గా డీఎల్‌పీఓ బొజ్జిరావు వ్యవహరించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ జి.హరీష్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు.

నేడు కామనగరువులో అభివృద్ధి పనుల ప్రారంభం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో సోమవారం పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించనున్నట్లుగా సర్పంచ్ నక్కా అరుణకుమారి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు చిట్టమ్మ చెరువు వద్ద రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.కోటితో చేపట్టిన బీటీ రోడ్డు, రూ.35 లక్షలతో కామనగరువు ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు భవనం ప్రారంభిస్తారన్నారు. కావున వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాపేవారి కాలనీకి రోడ్డు ఏర్పాటు చేస్తాం


సాపేవారి కాలనీకి వెళ్లే దారిని పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో భవనాల వెనుక సాపేవారికాలనీలో నివాసముంటున్న కుటుంబాల కోసం రోడ్డు ఏర్పాటుచేసే బాధ్యత తనదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హామీ ఇచ్చారు. బోడసకుర్రులోని సాపేవారికాలనీకి వెళ్లే దారిని ఆదివారం ఆయన పరిశీలించారు. మంత్రి వెంట పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, మాజీ సర్పంచ్ సాపే ధర్మరాజు, అంబటి శ్రీను, పలివెల చిట్టి, సాపే వెంకటేష్, సాపే ఏడుకొండలు తదితరులున్నారు.

జిప్‌మెర్ ఆసుపత్రి జాతికి అంకితం


జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభ సభలో పాల్గొన్న మంత్రి జయకుమార్, ఎమ్మెల్యే అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి తదితరులు


జిప్‌మెర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మల్లాడి కృష్ణారావు

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి ఉచిత వైద్యం

యానాం: యానాంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ ఆసుపత్రిని ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ రేస్ కోర్సు గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభ నుంచి ఆయన ఎయిమ్స్, మెడికల్ కాలేజీలతో పాటు యానాం జిప్‌మెర్‌ను సైతం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జిప్‌మెర్ ఆవరణలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి ప్రధాని ప్రారంభోత్సవాన్ని వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యానాంలో ఏర్పాటుచేసిన సభా వేదికపై పుదుచ్చేరి వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడుతూ జిప్‌మెర్ నిర్మాణంతో యానాం నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభం కావడం శుభపరిణామమని, దీనికి కృషిచేసిన అప్పటి ఆరోగ్యమంత్రి మల్లాడి కృష్ణారావును అందరూ అభినందించాలన్నారు. జిప్‌మెర్‌కు అనుబంధంగా యానాంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు తాను కేంద్ర, పుదుచ్చేరి ప్రభుత్వాలను ఒప్పించేలా కృషి చేస్తానన్నారు. న్యూఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ 2018 నుంచి జిప్‌మెర్ నిర్మాణానికి తాను చేసిన కృషితో పాటు అప్పటి కేంద్ర ఆరోగ్య కార్యదర్శి తెలుగు అధికారి ప్రీతిసుదాన్, అప్పటి కేంద్ర ఆరోగ్యమంత్రులు నడ్డా, హర్షవర్ధన్, డాక్టర్ ప్రశాంత్ తదితరులు తనకు ఎంతగానో సహకారం అందించారన్నారు. యానాంలో జిప్‌మెర్, ఆయుష్ ఆసుపత్రులతో పాటు శాయ్ అకాడమీ నెలకొల్పాలని, ఇంకా ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ సంస్థలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, సీపీడబ్ల్యూడీ ఇంజినీర్ దడాల లక్ష్మయ్య, జిప్‌మెర్ మెడికల్ సూపరింటెండెంట్ దొరై రాజన్, డిప్యూటీ డైరెక్టర్ కేజీ గోయల్, డైరెక్టర్ రాకేష్ అగర్వాల్, సీఏఓ ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదంటూ మల్లాడి ఆగ్రహం

జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభ శిలాఫలకంపై తన పేరు, ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు జిప్‌మెర్ అధికారులపై ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆసుపత్రిని జాతికి అంకితం చేశాక మల్లాడి మాట్లాడుతూ జిప్‌మెర్ ఆసుపత్రి తన కృషి వల్లే జరిగిందన్నారు. ఆ విధంగా తన పేరు, స్థానిక ఎమ్మెల్యే అశోక్ పేరు సైతం శిలాఫలకంపై లేకపోవడంపై ఆయన సూపరింటెండెంట్ దొరై రాజన్, సీఏఓ ఆనంద్‌రాజ్ తదితరులపై మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు కోరుకునేది శిలాఫలకంపై చిరస్థాయిగా నిలిచే పేరని అన్నారు. ఇన్విటేషన్‌లో సైతం ప్రొటోకాల్ పాటించలేదని, ఇది సరికాదన్నారు. ప్రొటోకాల్ తమ చేతుల్లో ఏమీ లేదని, అంతా ఆరోగ్యశాఖ చెప్పిన విధంగానే తాము నడుచుకున్నామని సీఏఓ ఆనంద్‌రాజ్ వివరణ ఇచ్చారు.

జగనన్న ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మునికుమారి

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించారని జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి పేర్కొన్నారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత, ఆమె భర్త గంగాధర్‌లు ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌పై చేసిన ఆరోపణలను ఖండించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లు మహిళలకు ఇచ్చిన గౌరవం ఏ రాజకీయ నాయకుడు ఇవ్వలేదన్నారు. తాళ్లరేవు ఎంపీపీ పదవి జనరల్ కేటగిరీకి చెందినా ఎస్సీ మహిళగా సునీతకు అవకాశం ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే పొన్నాడకే దక్కిందన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. మనస్పర్థలు ఉంటే పార్టీ సమక్షంలో చర్చించుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పుడు అన్యాయం జరగదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నల్లా బేబిజానకి, మాజీ ఏఎంసీ చైర్మన్ పెయ్యల భూలక్ష్మి, నాతి అలివేణి, మోకా చంద్రనాగరత్నం, తిరుకోటి శాంతిసుధ, పెట్ల శాంతకుమారి, మందపాటి మహాలక్ష్మి, చెల్లి భాగ్యలక్ష్మి, వరసాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు నుంచి మినహాయించాలి


కమిషనర్ మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు

అమలాపురం టౌన్‌: మున్సిపాలిటీలో మార్కెట్ ఆశీలు వేలానికి సంబంధించిన నోటిఫికేషన్‌లో రోడ్డు మార్జిన్ల వెంబడి రోజువారీ వ్యాపారాలు చేసుకునేవారిని మినహాయించాలని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. చాంబర్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపారులు కమిషనర్‌ను మున్సిపల్ కార్యాలయంలో శనివారం రాత్రి కలిశారు. ఈ మేరకు కమిషనర్ మనోహర్‌కు ఓ వినతి పత్రం అందించారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, కిరాణా వర్తక సంఘం ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, వ్యాపార సంఘాల ప్రతినిధులు కంచిపల్లి అబ్బులు, చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, రాయుడు నాని తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు కార్మికుల నూతన కార్యవర్గం


రైస్ మిల్లు కార్మికుల నూతన కార్యవర్గ సభ్యులు

యానాం: పట్టణంలోని మార్కెట్ ఆవరణలో ఆదివారం సలాది నాగబాబు అధ్యక్షతన జరిగిన కార్మికుల సమావేశంలో యానాం రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా సీఐటీయూ కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, అధ్యక్షుడిగా సబ్బతి రాంబాబు, కార్యదర్శిగా తిరికోటి శ్రీను, ఉపాధ్యక్షులుగా పిల్లి నూకరాజు, వై.అప్పారావు, సహాయ కార్యదర్శులుగా వాకపల్లి వెంకటేశ్వరరావు, గుత్తాల బాలరాజు, కోశాధికారిగా వాసంశెట్టి అర్జునరావు ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాటాన్ని ప్రధాని మోదీ అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీపుష్పయాగం

తాళ్లరేవు: మండలంలోని కాపులపాలెం సీతారామ చంద్రస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీపుష్పయాగం పూజా కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఆలయ అర్చకులు రాకుదిటి సత్యప్రసాదాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పండ్లు, పుష్పాలు, స్వీట్లతో పుష్పయాగాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ జెండా ధ్వంసం

ఉప్పలగుప్తం: మండలంలో కిత్తన చెరువు కూడలిలో ఉన్న వైఎస్సార్ సీపీ జెండాను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఈ మేరకు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణ్‌రావు, పార్టీ గ్రామ కార్యదర్శి దేవరపల్లి నానిబాబు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.మనోహరజోషి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ముత్యాలమ్మ వారు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో దాతల సహకారంతో రూ.కోటితో పునర్నిర్మించిన ముత్యాలమ్మ వారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు దంపతులు మహిళలకు పసుపు, కుంకుమ, రవికెలు పంపిణీ చేశారు. ముంగండలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తున్న తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి దుశ్శాలువాతో సత్కరించారు.

28న ఉద్యోగ మేళా

కొత్తపేట: రాజమహేంద్రవరంలో 28న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు జోన్-2 రీజినల్ జాబ్ మేళా రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ వద్ద జరుగుతుందన్నారు. ఈ మేళాకు 121 కంపెనీలు వస్తుండగా, ఆయా కంపెనీల్లో 18 నుంచి 35 ఏళ్ల వయసు వరకూ టెన్త్ నుంచి గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థుల విద్యార్హత, ఉద్యోగాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ. 35 వేలు, కొన్ని ఉద్యోగాలకు రూ.50 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఈ మేళాను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

అప్పనపల్లిలో భక్తజన కోలాహలం


అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం మాఘ మాసం ఆదివారం సందర్భంగా భక్తులతో కోలాహలంగా మారింది. వైనతేయ గోదావరి నదీలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ హోమం కన్నుల పండువగా జరిగింది. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.76 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.17 లక్షలు, అన్నదానం ట్రస్టుకు రూ.58,472 విరాళాలుగా వచ్చాయి. స్వామివారిని 3,185 మంది భక్తులు దర్శించుకోగా, 2,169 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి: కె.జగన్నాథపురంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ 86వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు, చెడి తాలింఖానా ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత, కాపునాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సరేష్, మూర్తి, నల్లా నాగు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎంఆర్‌కే దాస్ తెలిపారు. మండల పరిధిలోని జి.వేమవరం గ్రామానికి చెందిన ఏసురత్నం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం సీసాలు తరలిస్తుండగా పి.మల్లవరం బైపాస్ జంక్షన్‌లోని చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని, నిందితుడిని కోర్టు ఎదుట హాజరుపరుస్తామని ఎస్ఐ చిట్టిబాబు తెలిపారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ


అమ్మవారి ఆలయ ఆకృతిలో విద్యుత్ దీపాలంకరణ


అయోధ్య రామమందిరం ఆకృతి

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ జాతర తీర్థ మహోత్సవాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది. రూ.23 లక్షల ఖర్చుతో అమ్మవారి ఆలయ ఆకృతి, వివిధ దేవతా మూర్తుల ఆకృతులలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్తెమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు వచ్చే నెల 3 వరకూ జరగనుంది. అమ్మవారి జాతర రెండో రోజు బాజాభజంత్రీలు, గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవపేతంగా నిర్వహించారు.